సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం। 19। మార్చి। 2025







ఆధ్యాత్మిక నగరిలో ప్రపంచ సుందరి

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మంగళవారం మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని వివిధ పూజలు చేశారు. ఆలయ సంప్రదాయాలు, విశిష్టతను ఆమెకు అధికారులువివరించారు. ఆలయాన్ని సందర్శించడం చాలా సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. ఆమెకు ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదంతో పాటు శ్రీస్వామివారి చిత్రపటం అందజేశారు. - యాదగిరిగుట్ట

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి: రామన్నపేట ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (గైనకాలజీ), అనస్తీషియా పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ చిన్ననాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. నెలకు రూ.లక్ష పారితోషికం చెల్లించనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను ఈ నెల 20 నుంచి 27వ తేదీ లోపు అందించాలని, మరిన్ని వివరాలకు జిల్లా కేంద్ర వైద్యశాల సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్థిక వ్యూహాలతోనే సమాజ పురోభివృద్ధి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వాసుదేవ్ సెడెం

మిర్యాలగూడ : విద్యతోనే కాకుండా ఆర్థిక వ్యూహాలతో సమాజ పురోభివృద్ధి సాధించగలమని గుల్బర్గా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వాసుదేవ్ సెడెం అన్నారు. మిర్యాలగూడలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల జాతీయ సదస్సులో భాగంగా చివరి రోజైన మంగళవారం ప్రిన్సిపాల్ ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెమినార్ ద్వారా కొత్త ఆర్థిక సూత్రాలు, ఆలోచనలను సమర్థవంతంగా ఆవిష్కరించగలిగామన్నారు. ఆర్థిక సూత్రాలపై సవాళ్లు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై లోతైనా చర్చలు జరిపామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అన్నాసాగర్, రాపోలు భాస్కర్, డాక్టర్ నరేష్, కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సాక్షి,యాదాద్రి: 2024–2025 యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులు, హార్వెస్టింగ్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 4.50 లక్షల మెట్రిక్ ధాన్యం రానున్నందున పంట పొలాల వద్ద దశలవారీగా నియంత్రణకు సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వరి పంట చేతికి అందకముందే కోయడం ద్వారా, తాలు శాతం ఎక్కువగా వస్తుందని, హార్వెస్టర్ యజమానులు పూర్తిగా ఎండిన పంటను మాత్రమే కోయాలన్నారు. క్రాప్ బుకింగ్ డేటా ఆధారంగా ఏ పంట ఎన్ని రోజులకు కోత దశకు వస్తుందో వ్యవసాయ శాఖ అధికారులకు పూర్తి అవగాహన ఉన్నందున దానికి తగినట్లుగా కోతలను నిర్వహించాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, జిల్లా రవాణా అధికారి సాయికృష్ణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత, జిల్లా సహకార అధికారి శ్రీధర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి



బొల్లెపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న టీబీ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం

భువనగిరి: వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ టీబీ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు, భువనగిరి మండలంలోని బొల్లెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ ఔషధి మందులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మందుల సరఫరా వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. పాముకాటుకు, కుక్క కాటుకు అవసరమైన మందుల నిల్వలు పరిశీలించారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓ డాక్టర్ మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిల్పిని, ప్రోగ్రాం ఆఫీసర్ సాయిశోభ, పీఓ రవికుమార్, నల్లగొండ డ్రగ్స్ స్టోరీ సూపర్‌వైజర్ వీరారెడ్డి, రాష్ట్ర టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, భువనగిరి స్టోర్ ఇన్‌చార్జి శ్రీనివాస్, డాక్టర్ మురళీ, పుష్ప, సురేష్‌కుమార్, స్వాతి, కవిత, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టకు పాలక మండలి

- శాసన సభలో బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి
- 18 మంది సభ్యుల నియామకం
- పాలక మండలికి రెండేళ్ల పదవీ కాలం
- శాశ్వత సభ్యునిగా ఫౌండర్ ట్రస్టీ



సాక్షి, యాదాద్రి : తిరుమల తిరుపతి బోర్డు తరహాలో యాదగిరిగుట్ట పాలకమండలి(వైటీడీ) ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. యాదగిరిగుట్ట ఆలయానికి పాలక మండలిని 18 మందితో ఏర్పాటు చేయనున్నట్లు మంగళవారం అసెంబ్లీలో మంత్రి కొండా సురేఖ ప్రవేశపెట్టిన బిల్లులో వెల్లడించారు. పాలకమండలి పదవీకాలం రెండు సంవత్సరాలుగా నిర్ణయించారు. బోర్డు చైర్మన్, సభ్యులకు ఎలాంటి జీత భత్యాలు ఉండవు. టీఏ, డీఏ ఇస్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల యాదగిరిగుట్టకు వచ్చినప్పుడు చేసిన ప్రకటన మేరకు యాదగిరిగుట్టలో టీటీడీ స్థాయిలో పాలకమండలి ఏర్పాటుకు చట్ట సవరణ కోసం బిల్లును శాసనసభలో పెట్టారు. చైర్మన్ తోపాటు, వివిధ అనుభవజ్ఞులైన, అంకితభావం కలిగిన ట్రస్టీలను ప్రభుత్వం నియమిస్తుంది. ప్రస్తుతం కొత్త చట్టం ప్రకారం ఆలయ చైర్మన్‌తో పాటు 18 మంది సభ్యులు ఉంటారు. ఫౌండర్ ట్రస్టీతోపాటు ఒక ఎమ్మెల్యే, లేదా ఎమ్మెల్సీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సభ్యులతోపాటు మరో నలుగురు సభ్యులను నియమిస్తారు. పాలక మండలిలో ఒకరు వంశపారంపర్య ధర్మకర్త కాగా మిగతా 9 మందిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. వీరితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, ఆలయ ఈఓ, వైటీడీఏ వైస్ చైర్మన్, ఆలయ స్థానాచార్యులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. టీటీడీ బోర్డు మాదిరిగా వైటీడీ బోర్డుకు ఐఏఎస్ అధికారి ఈఓగా ఉంటారు. వైటీడీకి బడ్జెట్ ఆమోదం ప్రభుత్వం చేస్తుంది. టీటీడీబోర్డు తరహాలో యాదగిరిగుట్టలో ఆధ్యాత్మిక, వేద విద్యా సంస్థలను స్థాపించి నిర్వహించవచ్చు.

టెంపుల్ సిటీకి స్వయం ప్రతిపత్తి

యాదగిరిగుట్ట ఆలయానికి 1,241 ఎకరాల భూమి ఉంది. బిల్లు తరువాత ఈ ప్రాంతం అంతా కూడా స్వయం ప్రతిపత్తి కలిగిన టెంపుల్ సిటీగా మారుతుంది. ఇందులో దేవాలయ ప్రాంతం ప్రత్యేక టౌన్ షిప్‌గా మారనుంది. నూతనంగా ఏర్పాటయ్యే టెంపుల్ సిటీలో భిక్షాటన నిషేధం. మద్యం అమ్మకాలు, జంతువధ కూడా నిషేధిస్తారు. లైసెన్స్‌లు లేని వ్యాపారాలు చేయవద్దు.

యాదగిరిగుట్ట అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయడంతో పూర్వవైభవం వస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన యాదగిరిగుట్ట ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై మాట్లాడారు. గతంలో ఉన్న ట్రస్ట్ బోర్డుని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఆలయం నిర్మించినప్పటికీ భక్తులకు ఎలాంటి సదుపాయాలు కల్పించలేదన్నారు. శ్రీస్వామి వారి కొండపైన గతంలో 8, 9 ఎకరాల్లో చాలా సత్రాలు ఉండేవని, కానీ ఇప్పుడు నిద్ర చేయడానికి స్థలం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భక్తులు నిద్ర చేయడం కోసం డార్మెంటరీ హాల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. టెంపుల్ సిటీ అభివృద్ధి కోసం ఎంతో మంది దాతలు ముందుకు వచ్చినా ట్రస్ట్ బోర్డు లేక వెనక్కి వెళ్తున్నారన్నారు. వేద పాఠశాల కోసం సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పార్కింగ్ సమస్య ఎక్కువగా ఉందని, 2వేల నుంచి 5వేల కార్లు నిలిపేందుకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు. యాదగిరిగుట్ట అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. బీసీ కులగణన పూర్తి చేసి బిల్లును ఆమోదించడంతో సీఎం రేవంత్‌రెడ్డిని బీర్ల ఐలయ్య కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.



సీఎం రేవంత్‌రెడ్డిని గొంగడితో సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

బడ్జెట్‌లో మనకు ఎంత?

నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు ప్రాధాన్యం దక్కేనా..
- డిండి, ఏఎమ్మార్పీ, మూసీ కాలువలకు నిధులు వచ్చేనా..
- సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులపై ఆశాభావం
- టన్నెల్ పనులపై స్పష్టత వచ్చే అవకాశం



శివన్నగూడెం రిజర్వాయర్ పనులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ఈసారి ఏ మేరకు నిధులు వస్తాయో బుధవారం తేలనుంది. నేడు అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఆశతో ఉన్నారు. 3.11 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే కీలక ప్రాజెక్టు డిండి ఎత్తిపోతల పథకానికి ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై ఆశలు నెలకొన్నాయి. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన ఏదుల రిజర్వాయర్ నుంచే డిండికి నీటిని తీసుకునేందుకు ఈ ఏడాది జనవరిలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.1800 కోట్లతో దానికి సంబంధించిన పనులను చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. మరోవైపు డిండి కింద నిర్మిస్తున్న ఏడు రిజర్వాయర్లకు, కాలువలకు నిధుల అవసరం ఉంది. గత బడ్జెట్‌లో వాటికి రూ.300 కోట్లు కేటాయించిన నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌లో వాటికి అధిక కేటాయింపులు ఉంటాయని రైతులు భావిస్తున్నారు.

ఏఎంఆర్‌పీ లైనింగ్‌కు..

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు (ఏఎమ్మార్పీ) పరిధిలోని కాలువల ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. సాగునీటి పారుదల శాఖ కూడా దాదాపు రూ. 400 కోట్లతో ప్రధాన కాలువ లైనింగ్ కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ప్రధాన కాలువ లైనింగ్ దెబ్బతినడంతోపాటు కొన్ని చోట్ల డిస్ట్రిబ్యూటరీలకు లైనింగ్ లేకుండాపోయింది. కాలువలు కంపచెట్లతో నిండిపోయి చివరి ఆయకట్టు నీరందని పరిస్థితి నెలకొంది. అలాగే బ్రాహ్మణవెల్లెంల కాలువల పూర్తికి, నాగార్జునసాగర్ పెండింగ్ పనులకు, పాత ఎత్తిపోతల పథకాలకు నిధుల అవసరం ఉంది.

కాళేశ్వరం, మూసీ కాల్వలకు..

యాదాద్రి జిల్లాల్లో బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు రూ.200 కోట్ల పరిహారం రావాల్సి ఉంది. బునాదిగానికాల్వ, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, మూసీ కాలువల ఆధునికీకరణకు నిధులన ఇస్తామని మంత్రులు ప్రకటించారు. అయితే ఈ బడ్జెట్‌లో ఈ మేరకు వస్తాయనేది తేలనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న గందమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి బడ్జెట్‌లో కేటాయింపులపై ఆశలు నెలకొన్నాయి. సూర్యాపేట జిల్లాలో శ్రీరాంసాగర్ రెండో దశ చివరి ఆయకట్టు భూములకు నీరందించేందుకు కాల్వల అధునీకరణకు చర్యలు చేపడుతుందా? లేదా? తేలనుంది. వీటితోపాటు ఆస్పత్రుల అప్‌గ్రెడేషన్, జూనియర్, డిగ్రీ కాలేజీల మంజూరు వంటి అంశాలపై జిల్లా ప్రజలు డిమాండ్లు ఉన్నాయి.

యూనివర్సిటీకి నిధులు వచ్చేనా?

మహాత్మాగాంధీ యూనివర్సిటీ అభివృద్ధికి ఈసారైనా అధిక మొత్తంలో ప్రభుత్వం నిధులను కేటాయిస్తుందా? లేదా చూడాలి. గత ఏడాది కేవలం నిర్వహణ పద్దు కింద రూ.34.08 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈసారి రూ.309 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం ఏమేరకు బడ్జెట్ కేటాయిస్తుందో బుధవారం తేలనుంది.

టన్నెల్ పనులపై..

జిల్లాలో దాదాపు 4లక్షల ఎకరాలకు సాగునీరందించే ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం ప్రాజెక్టు పనులపై ఈ బడ్జెట్‌లో కొంత స్పష్టత రానుంది. ఇటీవల టన్నెల్ ఇన్‌లెట్ 14వ కిలోమీటర్ వద్ద కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిధులు కేటాయించి ప్రాజెక్టు పనులను కొనసాగిస్తుందా? లేదా అన్నది తేలనుంది. గత బడ్జెట్‌లో మాత్రం ఈ ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. రూ.798 కోట్లు కేటాయించింది. గ్రీన్ చానల్ ద్వారా నిధులను ఇచ్చి పూర్తి చేస్తామని ప్రకటించింది. ప్రస్తుతం ప్రమాదం జరిగిన నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితి, రీడిజైన్ వంటి అంశాలపై స్పష్టత వస్తుందని సాగునీటి శాఖ అధికారులు భావిస్తున్నారు.

బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలి



కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డు ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

- రెండోరోజు కొనసాగిన అంగన్‌వాడీ ఉద్యోగుల వంటావార్పు

భువనగిరిటౌన్: 19న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని తెలంగాణ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతరాజు జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సమస్యలపై అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన 48 గంటల వంటావార్పు మంగళవారం కలెక్టరేట్ ఎదుట కొనసాగింది. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో అంగన్‌వాడీలకు నెలకు రూ.18వేలు ఇస్తామని, పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నదని, గతంలో ఇచ్చిన హామీలను నేటి బడ్జెట్ సమావేశాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించాలని డిమాండ్ చేశారు. మొబైల్ సెంటర్ విధానం రద్దు చేసి ఐసీడీఎస్ సేవలను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 10 నెలల వేతనం చెల్లించాలని కోరారు. వంటావార్పు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ ఉద్యోగులు కలెక్టరేట్ లోపలికి చొచ్చుకెళ్లారు. పోలీసులకు, వారికి తోపులాట జరిగింది. కలెక్టర్ పిలుపు మేరకు పలువురు నాయకులను చాంబర్‌లోకి ఆహ్వానించారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బురుగు స్వప్న, చిలువేరు రామకుమారి, సీఐటీయూ నాయకులు మాయ కృష్ణ, కొల్లూరు ఆంజనేయులు, యూనియన్ జిల్లా నాయకులు కళ్యాణి, గంగుల రమ, పద్మ, రుక్మిణి, ప్రమీల, వసంత, సయేదా, ఉమ, జ్యోతి, శ్యామల, సునీత, సుజాత, సైదమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

- కలెక్టర్ హనుమంతరావు



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి: ఓటరు జాబితా సవరణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం వంటి నిర్వహణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాల్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్లను పరిశీలించి నమోదయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో భువనగిరి , చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లు, తాగు నీరు, పన్ను వసూళ్లు, ఎల్‌ఆర్‌ఎస్‌పై కలెక్టర్ మండలాల వారీగా సమీక్షించారు. అర్హులందరూ గడువులోగా తమ ప్లాట్లు రెగ్యులరైజేషన్ చేసుకోవాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

● పోచంపల్లిలో ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు



చేనేత కార్మికుల చిటికి కట్టే విధానాన్ని పరిశీలిస్తున్న ఛత్తీస్‌ఘడ్‌లోని అమిటీ యూనివర్సిటీకి చెందిన ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు - భూదాన్‌పోచంపల్లి

పన్ను చెల్లించడం లేదని వినూత్న నిరసన



పెట్రోల్ బంక్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది

చౌటుప్పల్ : మున్సిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లించని మొండిబకాయిదారుల పట్ల అధికారులు వినూత్న నిరసన తెలిపారు. చౌటుప్పల్ పట్టణంలోని రెండు పెట్రోల్ బంక్‌ల యజమానులు ఆస్తి పన్ను చెల్లించడం లేదు. నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో మున్సిపల్ కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. మంగళవారం మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు ఆయా పెట్రోల్‌బంకుల ఎదుట బైఠాయించారు. పన్నులు చెల్లించాలని నిరసన తెలిపారు. సకాలంలో పన్నుల చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో బాగస్వాములు కావాలని నినాదాలు చేశారు. ఒక పెట్రోల్ బంక్‌పై రూ.2లక్షలు, మరో బంకు రూ.3లక్షల పైగా ఆస్తిపన్ను బకాయిలు ఉన్నాయి. పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకారించాలని అధికారులు కోరారు.

సిజేరియన్లు మంచిది కాదు

- సాధారణ ప్రసవం కోసం వేచిచూడాలి
- గర్భం దాల్చగానే బెడ్ రెస్ట్‌కు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదు
- బాలికలు, యువతుల్లో రక్తహీనత అధికంగా ఉంది

'సాక్షి' ఇంటర్వ్యూలో జిల్లా కేంద్ర ఆస్పత్రి గైనకాలజీ విభాగం హెచ్‌ఓడీ, ప్రొఫెసర్ డాక్టర్ మాలతి



సాక్షి, యాదాద్రి: సాధారణ ప్రసవాలపై మరింత అవగాహన ఉండాలని జిల్లా కేంద్ర ఆస్పత్రి గైనకాలజీ విభాగం హెచ్‌ఓడీ, ప్రొఫెసర్ డాక్టర్ మాలతి తెలిపారు. జిల్లాలో అత్యధికంగా జరుగుతున్న సిజేరియన్లపై ఆమె మంగళవారం సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు. సిజేరియన్లు మంచిది కాదని, సాధారణ ప్రసవాలు చేయడానికి తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. రక్తహీనత, బెడ్‌రెస్ట్, ప్రసవం సమయంలో నొప్పులపై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. తొలిసారి సిజేరియన్ జరిగితే ఆ తర్వాత ప్రసవానికి కూడా సిజేరియన్ అవుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 70 శాతం ప్రసవాలు సిజేరియన్ అయ్యాయని, దీంతో రెండో ప్రసవం కూడా సిజేరియన్ చేయక తప్పని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

రక్త హీనత ప్రధాన సమస్య

జిల్లాలో బాలికలు, యువతులు, మహిళలల్లో రక్తహీనత అధికంగా ఉంది. ప్రసవానంతరం జరిగే కొన్ని మరణాలు రక్తహీనతతోనే జరగుతున్నాయి. ప్రతికాన్పు సమయంలో తల్లికి హిమోగ్లోబిన్ శాతం 11 గ్రాములు ఉండాలి. అప్పుడే పుట్టబోయే బిడ్డ ఎదుగుదల ఆరోగ్యంగా ఉంటుంది. గర్భిణుల్లో రక్తహీనతను తగ్గించడానికి అంగన్‌వాడీల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవాలి. దీనివల్ల ప్రతిరోజు 2500 కేలరీలు అందుతాయి. గర్భిణుల ఆరోగ్యం పెరుగుతుంది.

తప్పని పరిస్థితిలో మాత్రమే..

తల్లి గర్భంలో ఉన్న శిశువు మెడలో కొన్ని సార్లు పేగులు స్కానింగ్‌లో కన్పిస్తాయి. స్కానింగ్‌లో బిడ్డ బరువు 250 గ్రాములు ఎక్కువ చూపిస్తుంది. దానిని పరిగణలోకి తీసుకుని సిజేరియన్ చేయడం సరికాదు. అయితే తల్లి గర్భంలో పేగు మెడకు ఉన్నా సాధారణ ప్రసవం చేయొచ్చు. తప్పని పరిస్థితిలో మాత్రమే వైద్యులు ఇలాంటి కేసుల్లో సిజేరియన్లు చేస్తారు.

నెలకు 100కు పైగా ప్రసవాలు

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నెలకు 100కు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. తొలికాన్పులో ఎక్కువ సిజేరియన్లు కావడంతో రెండో కాన్పులోనూ సిజేరియన్లు చేయక తప్పడంలేదు. సాధారణ ప్రసవాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం 40 సాధారణ ప్రసవాలు జరిగితే.. 60 సిజేరియన్లు అవుతున్నాయి.

అధిక బెడ్ రెస్ట్ ప్రమాదకరం

కొందరు గర్భం దాల్చగానే బెడ్ రెస్ట్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనే బెడ్ రెస్ట్ తీసుకోవాలి. ప్రెగ్నెన్సీ మహిళలు ఎక్కువగా బెడ్ రెస్ట్ తీసుకోవడం వల్ల రక్త గడ్డకడుతుంది.

నొప్పులు వచ్చే వరకూ ఆగాలి

డెలివరీ సమయంలో నొప్పులు వచ్చే వరకూ చాలా మంది ఆగడం లేదు. గర్భిణుల్లో కొందరికి నొప్పులు వస్తాయి. మరికొందరికి రావు. అందుకు భయపడాల్సిన పనిలేదు. వైద్యుల పర్యవేక్షణలో వేచి చూడాలి. తల్లిదండ్రులు, భర్త సిజేరియన్ ద్వారా బిడ్డకు జన్మనివ్వాలని కోరుతున్నారు. మరికొందరు ముహూర్తాలు పెట్టుకుని సిజేరియన్ ద్వారా బిడ్డలను కంటున్నారు. ఇది సరైన పద్ధతి కాదు.

క్లుప్తంగా

రైలు కింద పడి ఆత్మహత్య


ఎల్లేష్ (ఫైల్)

నల్లగొండ, తిప్పర్తి: ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురైన వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిప్పర్తి మండలం రాయినిగూడెం సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం చిన్నమాదారం గ్రామానికి చెందిన వట్టికోట ఎల్లేష్(37) నల్ల గొండ పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో సప్లయర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య శ్రీలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఎల్లేష్ మనస్థాపానికి గురై సోమవారం రాత్రి తిప్పర్తి మండలం రాయినిగూడెం గ్రామ సమీపంలో రైలు పట్టాలపై సికింద్రాబాద్ వైపు వెళ్తున్న వందేభారత్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం నల్లగొండ రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

కుటుంబ సమస్యలతో బంగారం వ్యాపారి..

నకిరేకల్: కుటుంబ సమస్యలతో బంగారం వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణానికి చెందిన షేక్ అబ్బాస్ తన కూమారుడు శంషుద్దీన్(39)తో కలిసి స్థానిక మసీదు సమీపంలో బంగారం దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లారు. ఇంట్లో కుటుంబ సమస్యలతో శంషుద్దీన్ గొడవపడి తిరిగి షాపు వద్దకు వచ్చాడు. రాత్రి 12.30 గంటల సమయంలో శంషుద్దీన్ షాపులో బంగారం పాలిష్ చేసే లిక్విడ్ తాగాడు. కూమారుడు ఇంటికి రాలేదని తండ్రి అబ్బాస్ షాపు వద్దకు వచ్చి చూసేసరికి శంషుద్దీన్ అపస్మాకర స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతడిని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. మంగళవారం మృతుడి తండ్రి అబ్బాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రామచంద్రం (ఫైల్)

మునుగోడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మునుగోడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన బోయపల్లి రామచంద్రం(58) సోమవారం సాయంత్రం స్వగ్రామం నుంచి బైక్‌పై మునుగోడుకు వచ్చి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో మునుగోడు మండల కేంద్రం శివారులోని మంగళ్లదొడ్లగూడెం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి, కొడుకు జీవచ్ఛవంలా..!

- మంచానికే పరిమితం
- సెంట్రింగ్ పనికి వెళ్లి బిల్డింగ్ పైనుంచి జారిపడ్డ కుమారుడు
- రోడ్డు ప్రమాదంలో మెడ నరాలు తెగి చచ్చుబడిన తండ్రి శరీరం
- కుటుంబ పోషణ కోసం పెయింటర్‌గా పనిచేస్తున్న చిన్న కుమారుడు
- దాతల సాయం కోసం ఎదురుచూపు


మంచానికి పరిమితమైన పరశురాములు, అనిల్

మోత్కూరు: వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి తండ్రి, కుమారుడు మంచానికే పరిమితమయ్యారు. చిన్న కుమారుడు కుటుంబ పోషణ కోసం పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. భర్త, కుమారుడి పరిస్థితి చూడలేక, పూట గడవక ఆ ఇల్లాలు పడుతున్న వేదన వర్ణనాతీతం. కుటుంబ భారం మోయలేక, నెలవారీ వైద్య ఖర్చులు భరించలేక కన్నీరుమున్నీరవుతోంది. మోత్కూ రు మున్సిపల్ కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన వేముల పరశురాములుది నిరుపేద దళిత కుటుంబం. అతడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు అనిల్, సునీల్, కుమార్తె, వద్ధాప్యంలో ఉన్న తల్లి రామనర్సమ్మ ఉన్నారు. పరశురాములు మోత్కూరు పట్టణంలోని ఓ రైస్ మిల్లులో 25 ఏళ్లుగా హమాలీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్య లక్ష్మి కూలీ పనులకు వెళ్తోంది. భార్యాభర్తలు ఇద్దరు పనిచేస్తే వచ్చిన కొద్దిపాటి డబ్బులతోనే కుటుంబాన్ని పోషించుకుంటూ కుమారులను చదివిస్తూ పెద్ద చేశారు. పెద్ద కుమారుడు వేముల అనిల్ ఇంటర్మీడియట్ వరకు చదివి సెంట్రింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. సెంట్రింగ్ పనిలో భాగంగా సుమారు ఆరేళ్ల క్రితం అనిల్ మోత్కూరు పట్టణంలో ఓ బిల్డింగ్‌కు సెంట్రింగ్ డబ్బాలు ఇస్తుండగా ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కిందపడటంతో వెన్నుముక విరిగిపోయింది. కాళ్లు, చేతులు, నడుము సక్రమంగా పనిచేయలేకపోవడంతో పాటు కనీసం కూర్చోలేకపోవడంతో తల్లిదండ్రులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి వెన్నపూస విరిగిపోయిందని చెప్పారు. అప్పటికే రూ.1.80 లక్షలు వైద్యానికి ఖర్చు చేశారు. 15 రోజులకు ఒకసారి, నెలకు నాలుగేళ్ల పాటు వెన్నముక నరాలకు సంబంధించిన ఇంజెక్షన్లు ఇప్పించాలని డాక్టర్లు చెప్పారు. ఒక్క ఇంజక్షన్ ఖరీదు సుమారు రూ.25వేలు ఉంటుందని, మందులకు రూ.10వేలు ఖర్చవుతుందని అన్నారు. అంత డబ్బు వెచ్చించలేక కుమారుడిని ఇంటికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి అనిల్ ఇంటి వద్ద మంచానికే పరిమితమయ్యారు. తల్లే దగ్గరుండి అన్ని సపర్యలు చేస్తుంది. పెద్ద కుమారుడు మంచానికే పరిమితం కావడంతో ఖర్చులు పెరగడంతో పరశురాములు హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రాంతానికి వెళ్లి అడ్డా కూలీగా పనిచేయడం ప్రారంభించాడు. కొద్దిరోజుల తర్వాత పరశురాములు ఓ రోజు పని ముగించుకొని రాత్రి వేళ ఇంటికి నడుచుకుంటూ వెళ్తూ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు పరశురాములును సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మెడ నరాలు దెబ్బతిన్నాయని చెప్పారు. దీంతో మెడ నరాలకు ఆపరేషన్ చేయించారు. అయినప్పటికీ బలమైన గాయాలు కావడంతో స్పర్శ రాకపోవచ్చని, కోలుకోవడం కష్టమేనని వైద్యులు తేల్చారు. పరశురాములు కూడా శరీరం స్పర్శ కోల్పోయి మంచానికే పరిమితమయ్యారు. కళ్లెదుటే భర్త, కుమారుడు మంచానికే పరిమితమై జీవచ్ఛవంలా మారడంతో లక్ష్మి రోజువారి కూలీ పనులు మాని వారికి సపర్యలు చేస్తుంది. వద్ధాప్యంలో ఉన్న తన అత్తకు కూడా సేవలు చేస్తోంది. ఎలాగోలా 4 సంవత్సరాల క్రితం అతికష్టం మీద కుమార్తెకు వివాహం చేసి అత్తారింటికి పంపారు.

మా కుటుంబాన్ని ఆదుకోండి



నా పెద్ద కుమారుడు, భర్త మంచానికే పరిమితమయ్యారు. కదలలేరు, మెదలలేరు. సంపాదించిందే కాకుండా అప్పులు తెచ్చి వైద్యానికి సుమారు రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేశాం. ఉండే ఇల్లు తప్ప అమ్ముకోవడానికి గుంట భూమి లేదు. దాతలు ఎవరైనా మా కుటుంబాన్ని ఆదుకోండయ్యా. – వేముల లక్ష్మి

చిన్న కుమారుడిపై కుటుంబ భారం

పరశురాములు, లక్ష్మి దంపతుల చిన్న కుమారుడు సునీల్ డిగ్రీ వరకు చదివాడు. కుటుంబ పరిస్థితి దుర్భరంగా మారడంతో పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబ భారాన్ని మోస్తున్నాడు. ప్రతిరోజు కుటుంబం గడవడానికి అతడి సంపాదన సరిపోక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తండ్రి, అన్న మందుల ఖర్చుల కోసం నెలకు సుమారు రూ.25 వేలకు పైగా వెచ్చిస్తున్నాడు. డబ్బుల భారం పెరిగిపోవడంతో ఇటీవల మందులను కొనుగోలు చేయడం ఆపేశారు. ప్రస్తుతం ఆ కుటుంబం దుర్భర స్థితిలో కొట్టుమిట్టాడుతూ.. దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు.

సీపీఎస్ విధానం రద్దుకు కృషిచేస్తా

- పింగిలి శ్రీపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

సూర్యాపేట: ఉపాధ్యాయ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సీపీఎస్ రద్దు చేసేందుకు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట మండలం పిల్లలమర్రి శివాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేశారని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీ అమలుచేసే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని కృషిచేస్తానన్నారు. ఈ ఎండాకాలం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. తన గెలుపు కోసం కృషిచేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తంగేళ్ల జితేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తీగల నరేష్, మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొలికొండ కోటయ్య, పప్పుల వీరబాబు, రాష్ట్ర నాయకులు కందుకూరి శివశంకర్, గుగులోతు తావూరియా, కట్కూరు మధుసూదన్ రెడ్డి, గోదాసు దయాకర్, మేకల రాజశేఖర్, అల్లాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక

చిట్యాల: చిట్యాల పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో పందిరి సహస్ర లక్ష్మి, మహ్మద్ ముబాసిర్ అలీ, స్టాండ్ బై విభాగంలో పోకల ప్రీతిజెస్సి ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 28, 29, 30వ తేదీల్లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయ్ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి, ఏఓ పోలా గోవర్ధన్, పీఈటీ గంగాపురం రాము అభినందించారు.


జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రోడ్డు ప్రమాదంలో వలస కూలీ దుర్మరణం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ లక్ష్మయ్య

మిర్యాలగూడ టౌన్: ఆటోను లారీ ఢీకొనడంతో వలస కూలీ మృతిచెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్ సమీపంలో మంగళవారం జరిగింది. రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన కృష్ణకుమార్(22) మిర్యాలగూడకు వలస వచ్చి దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం అతడు మిర్యాలగూడ నుంచి అడవిదేవులపల్లి వైపు ఆటోలో వెళ్తున్నాడు. మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్ సమీపంలో గల సాంబశివ రైస్ మిల్లు వద్ద జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై ఆటోను లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణకుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్ అంజనేయులు, అతడి భార్య మాధవి, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాదగిరిగుట్ట క్షేత్రంలో 'స్వాతి' నక్షత్ర పూజలు


యాదగిరిగుట్ట చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకొని మంగళవారం భక్తులు, ఆలయాధికారులు, స్థానికులు గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం 5గంటలకు కొండ కింద గల వైకుంఠద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఇక ఆలయంలో స్వాతి హోమాన్ని నిర్వహించి, స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు అష్టోతర శతఘటాభిషేకం నిర్వహించారు.

పాలకుల చేతగానితనంతోనే ఈ దుస్థితి

- పంటలు ఎండిపోతుండడంతో రైతులు విలపిస్తున్నారు
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి


దుబ్బతండాలో మహిళా రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

పెన్‌పహాడ్: రాష్ట్రంలో పాలకుల చేతగానితనంతోనే పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. పొలాలు ఎండిపోయి రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. ఆయన మంగళవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని దుబ్బతండా, రత్యాతండాల్లో ఎండిపోయిన వరి చేలను పరిశీలించారు. ఎండిపోయిన పంటకు ఎకరాకు రూ.35వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఒక బటన్ నొక్కితే సూర్యాపేట జిల్లాకు నీళ్లు వస్తాయని తెలిపారు. ప్రభుత్వం మూర్ఖంగా ఆలోచిస్తుందన్నారు. ప్రభుత్వ కక్షపూరిత వైఖరి కారణంగానే సూర్యాపేటలో పంటలు ఎండిపోతున్నాయన్నారు. సూర్యాపేట జిల్లాలోనే 60వేల ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రికి నీళ్లు ఇవ్వాలన్న సోయి ఉండాలన్నారు. నీళ్లు ఇస్తామని చెప్తేనే రైతులు సాగు చేశారని ఆయన పేర్కొన్నారు. రైతు సమస్యలపై ప్రశ్నిస్తే, వాస్తవాలు మాట్లాడితే తనని అకారణంగా బడ్జెట్ సమావేశాల నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. ఎవరు ప్రశ్నించినా.. వారిపైన కేసులు పెట్టడం, నిర్బంధించడం, భయపెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. రేవంత్‌రెడ్డి ఒక్కసారి రైతుల వద్దకు వచ్చి చూస్తే.. రైతులు మీ బట్టలుడదీసి కొడతారన్నారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి తమ కళ్ల ముందే పంటల ఎండిపోతుంటే రైతులు తల్లడిల్లుతున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తమకు అప్పగిస్తే మూడే మూడు రోజుల్లో రైతుల పొలాలకు నీళ్లు ఇచ్చి చూపిస్తామని, అలా చేసే దమ్ముందా సీఎం రేవంత్ రెడ్డి అంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. జగదీష్‌రెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు నెమ్మాది భిక్షం, దొంగరి యుగేంధర్, వెన్న సీతారాంరెడ్డి, తూముల ఇంద్రసేనారావు, మిర్యాల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పోచంపల్లిని సందర్శించిన ఛత్తీస్‌గఢ్ విద్యార్థులు


కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌లో రీలింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు


చిటికిని పరిశీలిస్తున్న విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో గల అమిటీ యూనివర్సిటీలో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు అభ్యసిస్తున్న 15మంది విద్యార్థులు మంగళవారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. మాస్టర్ వీవర్ అంకం మురళి, కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను సందర్శించి అక్కడ దారం నుంచి వస్త్రం తయారయ్యే ప్రక్రియలన్నింటినీ ప్రత్యక్షంగా పరిశీలించారు. నూలు ఎక్కడ నుంచి దిగుమతి చేసుకుంటారని, ఏ రకమైన రంగులు, రసాయనాలను వినియోగిస్తారని, టై అండ్ డై విధానం, సాంప్రదాయ డిజైన్లు, మగ్గాలపై నేస్తున్న ఇక్కత్ వస్త్రాలు, మార్కెటింగ్, చేనేత కళాకారులకు లభిస్తున్న ఉపాధి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌లో కోకూన్ నుంచి దారం తీసే విధానం, ట్విస్టింగ్ యూనిట్, మగ్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దీక్షిక మాట్లాడుతూ.. తమ యూనివర్సిటీలోని ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు సిలబస్‌లో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ప్రాముఖ్యత గురించి ఉందని పేర్కొన్నారు. అందులో భాగంగానే ప్రాక్టికల్ ఎక్స్‌ప్లోరల్ విజిట్‌లో భాగంగా ఇక్కడికి వచ్చామని తెలిపారు. ఇక్కడ సంప్రదాయ వస్త్రాలు, ఇక్కత్ డిజైన్లు చూసి విద్యార్థులంతా మురిసిపోయారని అన్నారు. పోచంపల్లి పర్యటనతో మంచి ప్రాక్టికల్ అనుభవం లభించిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. వీరి వెంట గైడ్ పాంటా, రచ్చ సురేశ్ తదితరులు ఉన్నారు.

మిర్యాలలో భారీ పోలీసు బందోబస్తు

- చక్రయ్యగౌడ్ అంత్యక్రియలు పూర్తి

నూతనకల్: దారుణ హత్యకు గురైన నూతనకల్ మండలం మిర్యాల గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెంచు చక్రయ్యగౌడ్ అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మిర్యాల గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సూర్యాపేటలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని ర్యాలీగా మిర్యాల గ్రామానికి తీసుకొచ్చారు. మృతుడి కుమార్తె అనిత తండ్రికి తలకొరివి పెట్టింది. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహగౌడ్ మిర్యాలలోనే ఉన్నారు. ఏఎస్పీ నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో నలుగురు డీఎస్పీలు, 10మంది సీఐలు, 30మంది ఎస్‌ఐలు, 400మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. చక్రయ్య మృతదేహానికి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధాసుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మందుల భానుకిరణ్, మండల పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, పసుల అశోక్ యాదవ్, కాంగ్రెస్ నేతలు నివాళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు..?

చక్రయ్యగౌడ్‌ను హత్య చేసిన నిందితుల్లో ఏడుగురు పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. మిగతా నిందితుల కోసం వివిధ ప్రాంతాలకు పోలీసు బృందాలను పంపించి గాలిస్తున్నట్లు తెలిసింది.


తలకొరివి పెడుతున్న చక్రయ్యగౌడ్ కుమార్తె


అంతిమయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

అత్యాచారం కేసులో నిందితుడికి 25ఏళ్లు జైలు శిక్ష

చివ్వెంల(సూర్యాపేట), మోతె: ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 25ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు పోక్సో స్పెషల్ మెజిస్ట్రేట్ ఎం. శ్యామ్‌శ్రీ మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. మోతె మండల కేంద్రానికి చెందిన భార్యాభర్తలకు ఇద్దరు కుమార్తెలు సంతానం. వారు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 2023 మే 18న మండల కేంద్రంలోనే వారి బంధువు మృతిచెందడంతో ఇద్దరు కుమార్తెలను తీసుకుని అక్కడకు వెళ్లారు. అదే అంత్యక్రియల కార్యక్రమానికి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన వారి బంధువు నల్లగట్టు లక్ష్మయ్య వచ్చాడు. అంత్యక్రియల కార్యక్రమం జరుగుతుండగా సదరు మహిళ పెద్ద కుమార్తె(6)ను లక్ష్మయ్య ఎత్తుకుని గ్రామంలోని ఆ చిన్నారి ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పొద్దని బెదిరించాడు. కొద్దిరోజుల తర్వాత సదరు మహిళ తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని ఆమె తల్లిగారింటికి వెళ్లింది. ఆ సమయంలో పెద్ద కుమార్తె కడుపులో నొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతుండగా.. ఏం జరిగిందని కుమార్తెను అడుగగా ఆ చిన్నారి చెప్పలేదు. దీంతో అమ్మమ్మ చిన్నారిని దగ్గరకు తీసుకుని అడగగా.. జరిగిన విషయం మొత్తం చెప్పింది. వెంటనే చిన్నారిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఈ ఘటనపై 2023 మే 23న మోతె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి సీఐ వీరరాఘవులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకి రాంరెడ్డి వాదనలతో ఏకీభవిస్తూ పోక్సో యాక్ట్ ప్రకారం నిందితుడికి 25ఏళ్లు జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అదేవిధంగా బాధితురాలికి రూ.5 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కోర్టు పేర్కొంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు తదితరులు సహకరించారు.

క్రిమిసంహారక మందు పిచికారీ చేసిన రైతుకు అస్వస్థత

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి


మహేష్ (ఫైల్)

నాగారం: వరి పొలానికి క్రిమిసంహారక మందు పిచికారీ చేసి అస్వస్థతకు గురైన యువ రైతు మృతిచెందాడు. ఈ ఘటన నాగారం మండలం ఈటూరు గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈటూరు గ్రామానికి చెందిన కొమ్ము మహేశ్(31) మూడు రోజుల క్రితం తన వరి పొలానికి దోమ కాటు మందు పిచికారీ చేశాడు. ఈ క్రమంలో మందు అతడి శరీరంపై పడడంతో అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం అతడిని సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల ఘరానా మోసం

- ఫోన్‌లో బెదిరించి రూ.18లక్షలు నొక్కేసిన కేటుగాళ్లు

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి సైబర్ నేరగాళ్ల పన్నాగంలో చిక్కుకుని రూ.18లక్షలు వారికి చెల్లించి మోసపోయాడు. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. అబ్బిరెడ్డిగూడేనికి చెందిన వ్యక్తికి కొందరు వ్యక్తులు ఫోన్ చేసి తాము బెంగళూరుకు చెందిన సీబీఐ పోలీసులమని చెప్పి నమ్మించారు. మనుషులను కిడ్నాప్ చేసే ముఠా నుంచి మీ బ్యాంక్ అకౌంట్‌కి కమీషన్ రూపంలో రూ.30లక్షలు వచ్చాయని, దీనిపై సీబీఐ కేసు నమోదు చేసిందని సదరు వ్యక్తిని భయపెట్టారు. ఇతర దేశాల్లో ఉంటున్న మీ కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులపై కూడా కేసు నమోదు చేసే అవకాశం ఉందని ఫోన్‌లో బెదిరించారు. వారి మాటలు నమ్మిన సదరు వ్యక్తి సైబర్ నేరగాళ్లకు చెందిన వివిధ బ్యాంక్ అకౌంట్‌లకు రూ.18లక్షలు చెల్లించాడు. ఈ వ్యవహారం మొత్తం జనవరి రెండో వారం నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు 25రోజుల వ్యవధిలో జరిగింది. రూ.18లక్షలు చెల్లించినప్పటికీ సైబర్ నేరగాళ్లు మళ్లీ ఫోన్ చేసి బెదిరిస్తుండడంతో ఈ విషయాన్ని సదరు వ్యక్తి తన కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

వేసవిలో నాటుకోళ్ల పెంపకంలో జాగ్రత్తలు

- పెద్దవూర మండల పశువైద్యాధికారి చంద్రబాబు సూచనలు

పాడిపంట

పెద్దవూర: గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు ప్రతి ఇంట్లో నాటుకోళ్లను పెంచుతారు. అంతేకాకుండా ఇటీవలి కాలంలో చాలామంది బాయిలర్ కోళ్ల కంటే నాటు కోళ్లను తినేందుకు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. దీంతో చాలామంది నాటు కోళ్లను కూడా ఫాంలలో పెంచుతున్నారు. అయితే ఏటేటా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈసారి ఏప్రిల్, మే నెలలలో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. వేసవిలో కోళ్లకు బద్దె పురుగు వ్యాధి ప్రబలే అవకాశం ఉందని, ఈ వ్యాధి సోకకుండా కోళ్లఫారం యజమానులు, పెరటి కోళ్ల పెయజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దవూర మండల పశువైద్యాధికారి పిట్టల చంద్రబాబు సూచిస్తున్నారు.

❖ **బద్దె పురుగు నేపథ్యం..**

బద్దె పురుగు వంటి అంతర పరాన్న జీవులు కోళ్ల పేగుల్లో నివసిస్తూ వాటి పోషక పదార్థాలను సుష్టిగా హరించి వేస్తూ, జీవాల్లో ఉత్పాదక శక్తిని తగ్గిస్తాయి. చివరకు వాటిని బలహీనపరిచి పెరుగుదల లేకుండా చేస్తాయి. బద్దె పురుగు తెల్లగా సన్నటి రిబ్బన్ లాంటి శరీర సౌష్టవం కల్గి ఉంటాయి.

❖ **వ్యాధి సంక్రమించు విధానం..**

కొన్ని రకాల చీమలు, ఈగలు, మిడతలు, పేడ పురుగు, నేలపై తిరిగే నత్తలు కోడి పెంటలోని బద్దె పురుగుల గుడ్లను తినడంతో వాటి లార్వా ఈ కీటకాల్లో పెరుగుతుంది. కోళ్లు ఈ కీటకాలను తిన్నప్పుడు లార్వా పేగుల్లో పెరిగి బద్దె పురుగులా మారుతుంది. చిన్న వయస్సు కోళ్లకు ఎక్కువగా ఈ బద్దె పురుగు వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వ్యాధి సోకిన కోళ్ల కాళ్లలో నిస్సత్తువ, పెరుగుదల లేకపోవడం, ఎక్కువ నీరు తాగడం, గుడ్ల ఉత్పత్తి తగ్గడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. అతి చిన్న బద్దె పురుగులు పేగు గోడలలోనికి చొచ్చుకొని పోవడంతో రక్తస్రావం కలిగి కోళ్లు చనిపోతుంటాయి. మరికొన్ని పేగులపై చిన్న చిన్న గడ్డలు ఏర్పరుస్తాయి. బద్దె పురుగులు ఎక్కువ సంఖ్యలో ఉండి పేగులలో ఆహార కదలికకు అడ్డుపడడమేకాక, వాటి ఒత్తిడితో పేగులు బద్దలై కోళ్లు చనిపోయే ప్రమాదం కూడా ఉంది. ఈ పురుగుల వలన రోగనిరోధక శక్తి తగ్గి ఇతర వ్యాధుల టీకాలు వేసినా సత్ఫలితాలు ఇవ్వకపోవచ్చు.



❖ **రోగ నిర్ధారణ ఇలా..**

కోళ్ల గుంపులో ఎదుగుదల లేకున్నా, గుడ్ల ఉత్పత్తి తగ్గినా బద్దె పురుగు వ్యాధి ఉందని గ్రహించాలి. కోడి పెంటలో బద్దె పురుగుల శరీర ఖండాలు బియ్యపు గింజల్లాగా కనిపిస్తాయి. వ్యాధి నిర్ధారణకు ఒక కోడిని కోసి అందులోని ప్రేగులను చూస్తే బద్దె పురుగులు కనిపిస్తాయి.

చికిత్స, నివారణ చర్యలు ఇలా..

ఈ వ్యాధి సోకితే కిలో బరువుగల కోడికి బ్యూటినోరెట్ 150 మిల్లీ గ్రాములు, డైక్లోరోఫెన్ 200 గ్రాములు దాణాలో ఇవ్వాలి. మెబెండజోల్ పౌడర్ వంద కోళ్లకు 10 మి.గ్రా. చొప్పున దాణాలో ఇవ్వాలి. ఫెన్‌బెండజోల్ మరియు ప్రాజిక్వాంటాల్ వంటి ఇతర మందులను కూడా వాడవచ్చు. అలాగే కోళ్లు పెంచే ప్రాంతాలలో కీటకాలు వ్యాప్తి చెందకుండా డెల్టామెత్రిన్ అనే మందు ద్రావణాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేకపోతే ఫినాల్, సైథియాన్ వంటి క్రిమిసంహారక మందులను నీటిలో కలిపి కోళ్ల షెడ్డు లోపల చుట్టుపక్కల పిచికారీ చేయాలి.